**63వ అధ్యాయం**

# ٦٣ - بَابُ التَّنَافُسِ فِي أُمُورِ الآخِرَةِ وَالاِسْتِكْثَارِ مِمَّا يُتَبَرَّكُ بِهِ

# పారలౌకిక విషయాల్లో ఒకర్నొకరు మించిపోవటానికి ప్రయత్నించటం, శుభప్రదమైన వస్తువుల పట్ల ఆసక్తిని కనబరచటం.....

قال الله تعالى: ﴿وَفِي ذَٰلِكَ فَلْيَتَنَافَسِ الْمُتَنَافِسُونَ﴾ [المطففين: ٢٦].

దివ్య ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ సెలవిచ్చాడు : "ఇతరుల్ని మించిపోవాలని కోరుకునేవారు దీన్ని (స్వర్గాన్ని) పొందే విషయంలో మించి పోవటానికి కృషిచేయాలి."

*(అల్ ముతఫ్ఫిఫీన్ : 26)*

٥٦٩ - وعن سهل بن سعد رضي الله عنه أن رسول الله ﷺ أُتِيَ بِشَرَابٍ، فَشَرِبَ مِنْهُ، وَعَنْ يَمِينِهِ غُلامٌ، وَعَن يَسَارِهِ الأَشْيَاخُ، فقال لِلغُلامِ: «أَتَأْذَنُ لِي أَنْ أُعْطِيَ هؤُلاءِ؟» فَقَالَ الغُلامُ: لا وَاللهِ يَا رَسُولَ اللهِ لا أُوثِرُ بِنَصِيبِي مِنكَ أَحَداً، فَتَلَّهُ رَسُولُ اللهِ ﷺ فِي يَدِهِ. متفق عليه. «تَلَّهُ» بالتاءِ المثناة فوق، أَيْ: وَضَعَهُ، وهٰذا الغُلامُ هُوَ ابنُ عَبَّاسٍ رضي الله عنهما.

569. హజ్రత్ సహ్ల్ బిన్ సాద్ (రజి) కథనం : దైవప్రవక్త (సల్లం)కు ఎవరో ఏదో పానీయం (కానుకగా) సమర్పించు కున్నారు. ఆయన అందులో కొంత తాగారు. ఆ సమయంలో ఆయనకు కుడి ప్రక్కన ఒక బాలుడు ఉన్నాడు. ఎడమ ప్రక్కన పెద్దవాళ్ళున్నారు. దైవ ప్రవక్త (సల్లం) ఆ పిల్లవాడితో, "నువ్వు అనుమతిస్తే నేనీ పానీయాన్ని పెద్దలకు ఇస్తాను" అన్నారు. దానికా బాలుడు, "దైవసాక్షి! నేను ఒప్పుకోను. మీరిచ్చే వస్తువుని నేను ఇతరులకు త్యాగం చెయ్యలేను దైవప్రవక్తా!" అని అన్నాడు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) పానీయ గిన్నెను ఆ బాలునికే ఇచ్చేశారు.

*(బుఖారీ - ముస్లిం)*

*(సహీహ్ బుఖారీలోని అత్యాచారాల ప్రకరణం, సహీహ్ ముస్లింలోని పానీయాల ప్రకరణం)*

## ముఖ్యాంశాలు

సమావేశంలో కూర్చొని ఉన్నవారికి ఏదైనా పంచిపెట్టాలనుకున్నప్పుడు కుడివైపు నుండి మొదలుపెట్టాలి. హదీసులో ప్రస్తావనకు వచ్చిన సంఘటనలో దైవప్రవక్త (సల్లం)కు కుడివైపున అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ ఉన్నారు. ఆయన ఆ సమావేశంలోని వారందరికన్నా చాలా చిన్నవారు. పెద్దలంతా దైవప్రవక్త (సల్లం)కు ఎడమవైపు కూర్చొని ఉన్నారు. సాధారణ పరిస్థితుల్లో ఏదయినా వస్తువు పంచిపెట్టాలన్నప్పుడు పెద్దలనుండి మొదలుపెడతారు. కాని మరోవైపు సమావేశాల్లో ఉన్నప్పుడు కుడివైపు నుండి మొదలుపెట్టాలన్న నియమం కూడా ఉంది. అంచేత దైవప్రవక్త (సల్లం) ఇబ్నె అబ్బాస్ చిన్న పిల్లవాడని చూడకుండా ఆయన హక్కుని గుర్తించి, ఆయన అనుమతితో ఆ పానీయాన్ని పెద్దలికివ్వాలని నిశ్చయించుకున్నారు.

ఇబ్నె అబ్బాస్ (రజి) ఆ సమావేశంలో అందరికన్నా చిన్నవారు. నైతికంగా చూస్తే పెద్దల గౌరవార్థం ఆయన తన హక్కుని త్యాగం చేసి ఆ పానీయం పెద్దలకే ఇవ్వమని చెప్పాలి. కాని ఆయన తన హక్కుని త్యాగం చేయటంకన్నా దైవప్రవక్త శుభ అధరాలు తాకిన పానీయాన్ని ముందుగా తాను సేవించటానికే ఎక్కువ ప్రాధాన్యతనిచ్చారు.

570. హజ్రత్ అబూ హురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా తెలియజేశారు : ఒకసారి అయ్యూబ్ (అలైహి) దిగంబరులై స్నానం చేస్తుండగా ఆయనపై బంగారు మిడుతలు వచ్చి పడసాగాయి. అయ్యూబ్ వాటిని దోసిళ్ళతో పట్టుకొని వస్త్రంలో సమీకరించుకోసాగారు. అప్పుడు ఆకాశం నుండి దేవుడు ఆయన్ని పిలుస్తూ, “ఓ అయ్యూబ్! నేను (నీకు విపరీతమైన సిరిసంపదలను ప్రసాదించి) నువ్వు ప్రోగుచేసుకుంటున్నవాటి నుంచి నిన్ను నిరపేక్షాపరునిగా చెయ్యలేదా?” అని అడిగాడు. దానికి అయ్యూబ్ “నీ ఔన్నత్యం సాక్షి! నిస్సందేహంగా చేశావు. కాని నాపై అవతరించే శుభం విషయంలోనయితే నిరపేక్షాపరునిగా చెయ్యలేదు కదా!” అన్నారు అయ్యూబ్ (అలైహిస్సలాం) *(బుఖారీ)*

*(సహీహ్ బుఖారీలోని దైవప్రవక్తల ప్రకరణం)*

٥٧٠ ـ وعن أبي هريرة رضي الله عنه عنِ النَّبي ﷺ قالَ: «بَيْنَا أَيُّوبُ عليه السلام يَغتَسِلُ عُرْيَاناً، فَخَرَّ عَلَيْهِ جَرَادٌ مِنْ ذَهَبٍ، فَجَعَلَ أَيُّوبُ يَحثِي في ثَوبِهِ، فَنَادَاهُ رَبُّهُ عَزَّ وَجَلَّ: يَا أَيُّوبُ! أَلَم أَكُنْ أَغنَيْتُكَ عَمَّا تَرَى؟! قال: بَلَى وَعِزَّتِكَ، وَلٰكِن لا غِنَى بِي عَن بَرَكَتِكَ» رواه البخاري.